రాజధానిలోనూ కొసెల్లని సొరంగం

16 ఏండ్లయినా పూర్తికాని కాంగ్రెస్ మార్కు విచిత్ర ప్రాజెక్టు

ట్రెంచ్‌లెస్ టెక్నాలజీతో 5 కి.మీ మురుగు వ్యవస్థ.. నేటికీ ఒడవని కథ

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 10 (నమస్తే తెలంగాణ): ఎస్సెల్బీసీ..! కాంగ్రెస్ సర్కారు నిర్వాకంతో మొన్ననే కుప్పకూలిన సొరంగ ప్రాజెక్టు ఇది! తెలంగాణ సాగునీటి రంగంలో ఇదో పెద్ద చిక్కుముడి! టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)తో ఏకధాటిగా 43 కి.మీ సొరంగం తవ్వాలి. టీబీఎం ముందుకుపోవాలి తప్ప వెనక్కి రాలేదు. యంత్రం మొదలైందంటే నెలకు కనాకష్టంగా ఆరు మీటర్లు ముందుకుపోతే అదే గొప్ప! నిత్యం సాంకేతిక సమస్యలే! ఇలా 2008లో పనులు మొదలైతే తొమ్మిదిన్నర కి.మీ పెండింగే! చివరికి కాంగ్రెస్ ప్రభుత్వం పుణ్యాన సొరంగం కుప్పకూలి.. ఇంకా ఆరుగురి అమాయకుల మృతదేహాలు మట్టిలోనే కూరుకుపోయి ఉన్నాయి. కనీసం వాటిని బయటికి తీసి వారి కుటుంబ సభ్యులకు అప్పగించలేని దౌర్భాగ్య పరిస్థితి!

2009లో మొదలై..

'మా తాతలు నేతులు తాగారు!' అన్నట్టుగా నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను తామే కట్టామంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ నిర్వాకాలు అనీఇన్నీ కావు. ఏదో కొత్త టెక్నాలజీ పేరు చెప్పి కోట్ల రూపాయల టెండర్లు పిలవడం.. టెక్నాలజీ విఫలమై కాంట్రాక్టర్లు పారిపోవడం.. అప్పటికే ఆ విచిత్ర ప్రాజెక్టు అంచనా వ్యయం తడిసిమోపెడు కావడం.. చివరికి అదో గుదిబండ ప్రాజెక్టుగా మారడం ఆనవాయితీగా తయారైంది. ఇదే కోవలో నగరంలో లిబర్టీ నుంచి నింబోలి అడ్డా వరకు ఐదు కిలోమీటర్ల మేర ట్రెంచ్‌లెస్ టెక్నాలజీతో చేపట్టిన డ్రైనేజీ ప్రాజెక్టు నిలిచింది. రూ.76.43 కోట్ల అంచనాతో 2009లో ఈ ప్రాజెక్టు మొదలైంది. ఇప్పటివరకు అంచనా వ్యయం ఎంతయిందో కూడా అధికారులే కచ్చితంగా చెప్పలేని పరిస్థితి! నగరం నడిబొడ్డున లిబర్టీ నుంచి నింబోలి అడ్డా వరకు ఐదు కిలోమీటర్ల మేర.. ప్రధాన రహదారుల కింద భూమి లోపల సరాసరి 10-16 మీటర్ల లోతులో సొరంగాన్ని తవ్వుకుంటూ ఏకంగా 1800 ఎంఎం పైప్‌లైన్ వేయాలి. మైక్రో టీబీఎం పని చేయడం లేదంటూ కాంట్రాక్టు సంస్థ చేతులెత్తేసింది. దీంతో గత కేసీఆర్ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అధికారులు చిన్న చిన్న ముక్కలుగా పనులను విభజించి.. మాన్యువల్‌గా పూర్తి చేసేందుకు ఆపసోపాలు పడుతున్నారు. అసలు ప్రాజెక్టు చేపట్టక ముందే ఎక్కడ ఎలాంటి రాతిపొరలు ఉన్నాయి? ఇతర సాంకేతిక అంశాలపై సమగ్ర అధ్యయనమే లేదు. దాని ఫలితంగానే ప్రాజెక్టు ఆద్యంతం గందరగోళంగా తయారైంది. ఎలాగైనా కింగ్‌కోఠి నుంచి అంబర్‌పేట వరకు మరో నెలన్నరలో పనులు పూర్తి చేసి డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు జలమండలి కసరత్తు చేస్తున్నది. కానీ కీలకమైన లిబర్టీ నుంచి బషీర్‌బాగ్ వరకు పూర్తిగా రాతి ప్రాంతం (రాక్ ఏరియా) కావడంతో అక్కడ పనుల నిర్వహణ సవాల్‌గా మారనున్నదని అధికారులు చెప్తున్నారు. అంటే కాంగ్రెస్ మార్కు విచిత్రమైన ప్రాజెక్టు 16 ఏండ్ల తర్వాత కూడా కొలిక్కి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. అక్కడ ఎస్సెల్బీసీలో టీబీఎం పేరుతో ముందుకు పోలేక.. వెనక్కి రాలేక.. చివరికి సొరంగం కుప్పకూలింది. నగరంలో డ్రైనేజీ ప్రాజెక్టులోనూ కాంగ్రెస్ మార్కు సొరంగం తవ్వలేక కాంట్రాక్టు సంస్థ చేతులెత్తేస్తే ఇప్పుడు మాన్యువల్‌గా పనులు చేయించాల్సి వస్తున్నది.

నగర నడిబొడ్డున ఒడవని కథ

ఈ 'సొరంగాల' నిర్వాకం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదు. నల్లమల అటవీ ప్రాంతంలోనే కాదు.. రాష్ట్ర రాజధానిలోనూ కాంగ్రెస్ మార్కు విచిత్ర ప్రాజెక్టు ఒకటి దశాబ్దంన్నరగా ఆపసోపాలు పడుతున్నది. అదీ.. టీబీఎంతోనే! కాకపోతే ఇది మైక్రో టన్నెల్ బోరింగ్ మిషన్. ట్రెంచ్‌లెస్ టెక్నాలజీతో నగరం నడిబొడ్డున ఐదు కి.మీ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మొదలుపెట్టిన ప్రాజెక్టు అది! పనులు దక్కించుకున్న కాంట్రాక్టు కంపెనీ 'ఇదెక్కడి టెక్నాలజీ బాబోయ్!' అని అప్పుడే చేతులెత్తేసి పత్తా లేకుండా పారిపోయింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరో కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చి వెంటపడినా ఏడాదికి కిలోమీటరు తవ్వితే అదే గొప్ప! ఐదు కి.మీలలో నేటికీ ఇంకా 400 మీటర్ల వరకు సొరంగాన్ని తవ్వాల్సి ఉన్నది.

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం కృష్ణానదిలో వజ్రాల మడుగు వద్ద టెయిల్ పాండ్ (ఫైల్)



నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం కృష్ణానదిలో వజ్రాల మడుగు వద్ద గండి పడిన టెయిల్ పాండ్ (ఫైల్)

100 కోట్లు కృష్ణార్పణం!

- **శ్రీశైలంలో రివర్స్ పంపింగ్ కోసం వజ్రాలమడుగు సపోర్ట్ డ్యాం**
- **రూ.130 కోట్లతో 2004లో మొదలుపెట్టిన కాంగ్రెస్ సర్కారు**
- **వినియోగంలోకి రాకుండానే వరదలతో సపోర్ట్ డ్యాం ధ్వంసం**
- **మరమ్మతులు కాకుండా మొత్తం కూల్చి కట్టాలన్న ఐఐటీ బృందం**
- **పదేండ్లలో కనీసం ఒక్క చెక్‌డ్యాంను కట్టలేకపోయిన హస్తం పార్టీ**

దోమలపెంట, జూన్ 10 : 'పనిమంతుడు పందిరేస్తే.. కుక్కతోక తగిలి కూలిపోయిందట!'.. నాగార్జునసాగర్ నిర్మించాం.. శ్రీశైలం కట్టాం.. అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ.. దాదాపు రెండున్నర దశాబ్దాల్లో తెలంగాణ గడ్డపై తలపెట్టి పూర్తి చేసిన ఒక్క ప్రాజెక్టు కూడా లేదు. ప్రాణహిత-చేవెళ్లలో తమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మించలేక తోక దగ్గర కాల్వలు, టన్నెళ్లు తవ్వి మొబిలైజేషన్ అడ్వాన్సులు మింగేశారు. పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టుల్లో కాల్వలు తవ్వి నీటి ఎత్తిపోతలను అటకెక్కించారు. శ్రీశైలం సొరంగం పేరిట కొత్త టెక్నాలజీని తెచ్చిపెట్టి తెలంగాణ నెత్తిన ఓ గుదిబండను మోపారు. చివరికి ఏడాదిన్నర కిందట అధికారంలోకి వచ్చి ఆ సొరంగాన్నీ కుప్పకూల్చారు. ఇలా ఘనత వహించిన కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్వాకంలో తాజాగా మరో కలికితురాయి తెరపైకి వచ్చింది. సాగునీటి ప్రాజెక్టులు దేవురుడెరుగు.. ఒక చిన్న చెక్‌డ్యాం లాంటి నిర్మాణాన్ని కూడా పటిష్టంగా పూర్తి చేసి వినియోగంలోకి తేలేని దుస్థితి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ ఈ డ్యాం పూర్తయితే శ్రీశైలంలో 365 రోజుల పాటు రివర్స్ పంపింగ్ జరిగే అవకాశం ఉండేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో అది ధ్వంసమై వంద కోట్ల రూపాయలు 'కృష్ణా'ర్పణమయ్యాయి. కాంగ్రెస్ కిరీటంలో ఇన్ని ఘనకార్యాలు పెట్టుకొని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ బరాజ్‌లో ఒక్క పిల్లర్ కుంగిపోతే ఆ పార్టీ ప్రభుత్వం చేసే రంధ్రాన్వేషణ.. ప్రభుత్వ పెద్దలు వల్లించే నీతి వ్యాఖ్యాలను చూస్తుంటే 'నవ్విపోదురుగాక!' అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

2004లో సపోర్ట్ డ్యాం మొదలు

శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రంలో భాగంగా రివర్సబుల్ మోడ్‌లో కూడా టర్బైన్లు తిరుగుతాయి. దీని ద్వారా డ్యాం దిగువన ఉన్న జలాలను తిరిగి డ్యాంలోకి ఎత్తిపోసి.. తిరిగి అదే నీటితో కరెంటు ఉత్పత్తి చేసి దిగువకు వదులుతారు. ఈ క్రమంలో రివర్సబుల్ పంపింగ్ జరగాలంటే నాగార్జునసాగర్‌లో కనీసం 530 అడుగుల నీటిమట్టం ఉండాలి. తద్వారా విద్యుత్తు కేంద్రంలోకి వెళ్లే ఎగ్జిట్ టన్నెల్‌కు నీళ్లు అందుతాయి. ఈ టన్నెల్ డ్యాం దిగువన రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సాగర్‌లో నీటి మట్టం పడిపోతే ఈ రివర్సబుల్ పంపింగ్ నిలిచిపోతుంది. ఇలా కాకుండా 365 రోజులూ రివర్స్ పంపింగ్ జరగాలంటే టన్నెల్‌లోకి నీటి లభ్యత ఉండాలి. ఇందుకోసం 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలోని వజ్రాలమడుగు దగ్గర డ్యాం దిగువన 14వ కిలోమీటరు వద్ద సపోర్ట్ డ్యాం (చెక్‌డ్యాంలాంటి నిర్మాణం) కట్టాలని నిర్ణయించింది. దీని నీటి నిల్వ సామర్థ్యం టీఎంసీ. దీని ద్వారా సాగర్‌లో నీటిమట్టం పడిపోయినా 14 కిలోమీటర్ల వరకు నీటి లభ్యత అంటే టీఎంసీ నీరు అందుబాటులో ఉంటుంది. దీంతో రివర్స్ పంపింగ్ చేయవచ్చు. తిరిగి డ్యాం నుంచి నీటిని వదిలినా ఈ సపోర్ట్ డ్యాంలోనే ఉంటాయి. ఇలా ఏడాది పొడవునా రివర్స్ పంపింగ్‌కు వెసులుబాటు ఉంటుంది. జల విద్యుదుత్పాదనలో భాగంగా నాన్ పీక్ అవర్స్‌లో బహిరంగ మార్కెట్లో కరెంటు రేటు తక్కువగా ఉంటుంది. ఆ సమయంలో యూనిట్‌కు దాదాపు రూ.4-5 వరకు కరెంటు దొరికినపుడు ఈ డ్యాంలోని నీటిని రివర్స్ పంపింగ్ ద్వారా డ్యాంలోకి ఎత్తిపోస్తారు. పీక్ అవర్స్‌లో డ్యాం నుంచి జల విద్యుత్తు కేంద్రంలో అదే టీఎంసీ నీటితో కరెంటు ఉత్పత్తి చేసి దిగువకు వదులుతారు. దిగువ నుంచి ఎగువకు ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసేందుకు 6.6 మిలియన్ యూనిట్ల కరెంటు ఖర్చయితే.. అదే టీఎంసీ నీటిని డ్యాం నుంచి దిగువకు వదిలే సమయంలో 5.5 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చు. పీక్.. నాన్ పీక్ అవర్స్ ప్రామాణికంగా ఈ ప్రక్రియలు చేపడుతున్నందున కరెంటు ఉత్పత్తిలో ఇదో కీలక ప్రాజెక్టుగా అధికారులు అభివర్ణిస్తున్నారు. కానీ ఇలాంటి ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం గంగపాలు చేసింది. దీంతో ఇప్పుడు నాగార్జునసాగర్‌లో నీటిమట్టం 530 అడుగుల కంటే తక్కువగా ఉండటంతో రివర్స్ పంపింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. తిరిగి సాగర్‌కు ఇన్‌ఫ్లో వచ్చే వరకు రివర్స్ పంపింగ్ అనేది జరగదు.

చివరి దశలోనే నీటి పాలు

2004లో శ్రీశైలం డ్యాం నుంచి 14 కిలోమీటర్ల దూరంలో సాగర్‌కు నీళ్లు వెళ్లే చోట సుమారు రూ.130 కోట్లతో నిర్మాణ పనులకు నాటి కాంగ్రెస్ సర్కారు ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు పిలిచింది. శ్రీశైలం ఎడమ గట్టు జల విద్యుత్తు కేంద్రం నిర్మాణ పనులు చేపట్టిన పటేల్ కంపెనీనే రూ.100 కోట్లకు టెండర్ దక్కించుకున్నది. నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 512 మీటర్ల పొడవు.. 170 మీటర్ల ఎత్తుతో టెయిల్ పాండ్ నిర్మాణం చేపట్టారు. రెండేండ్ల పాటు దాదాపు 65 మీటర్ల ఎత్తు నిర్మాణం పూర్తయ్యే వరకు అటవీ శాఖ పర్యావరణ అనుమతులు లేవన్న అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో 2006-2009 వరకు పనులు నిలిచిపోయాయి. సదరు కాంట్రాక్టు సంస్థ చేసిన పనులకు జెన్‌కో నుంచి రూ.36 కోట్లు చెల్లించారు. 2010లో అటవీ శాఖ ఇబ్బందులతో అసంపూర్తిగా చేసిన పనులను వదిలేసిన పటేల్ కంపెనీ కాంట్రాక్టును రద్దు చేసుకున్నది. తర్వాత మిగిలిన పనులు పూర్తి చేసేందుకు 2010లో హైదరాబాద్‌కు చెందిన బీవీఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులు ప్రారంభించింది. 512 మీటర్ల పొడవులో ఉన్న టెయిల్ పాండ్ ఎడమ వైపు 170 మీటర్ల ఎత్తు వరకు ఉంటే 35 మీటర్ల వరకు పనులు పూర్తి చేసింది. మిగితా 164.7 మీటర్ల ఎత్తుకు కాంక్రీట్ పనులు జరిగే సమయంలో 2015 నవంబర్ 19న శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో అన్ని యూనిట్లలో విద్యుదుత్పత్తి చేసి దాదాపు 40 వేల క్యూసెక్కులు విడుదల చేయడంతో చివరి దశ నిర్మాణ పనుల్లో ఉన్న సపోర్ట్ డ్యాంకు గండి పడింది.

నాసిరకం పనులే కారణం

డ్యాంకు గండిపడినప్పుడు స్థానికులు కూడా పెద్ద ఎత్తున నిరసన తెలిపి, అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వాస్తవానికి ఈ సపోర్ట్ డ్యాంను కాంక్రీట్‌తో నిర్మించాల్సి ఉన్నా కాంట్రాక్టర్లు అందుకు భిన్నంగా నదిలోనే దొరికే రాళ్లను పేర్చి నిర్మించారని, ఇందులో భాగంగా సున్నపు రాళ్లను కూడా పెట్టి నిర్మాణం చేపట్టారని విచారణలో తేలింది. దీని కారణంగానే 40 వేల క్యూసెక్కుల వరదకే డ్యాంకు గండిపడింది. కాగా డ్యాంను పునరుద్ధరించేందుకు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీ కృష్ణ ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు తెలిసింది. ఇందులో భాగంగా ఎస్సెల్బీసీ సొరంగం కుప్పకూలిన సమయంలో అక్కడికి వచ్చిన ఐఐటీ బృందంతో కలిసి ఈ డ్యాంను కూడా పరిశీలించారు. నాసిరకంగా నిర్మించిన ఈ సపోర్ట్ డ్యాంను పునరుద్ధరించినా ఫలితం ఉండదని, కొత్తగా నిర్మించాల్సిందేనని సదరు బృందం తేల్చి చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో నిర్మాణానికి వెచ్చించిన రూ.వంద కోట్లు కృష్ణార్పణమేనని స్పష్టమవుతున్నది. అయితే ఒక చిన్న చెక్‌డ్యాం లాంటి నిర్మాణాన్ని పటిష్టంగా కట్టలేని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసిన కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక రంధ్రాన్వేషణ చేస్తున్నదన్న చర్చ నడుస్తున్నది.

బనకచర్లపై బుకాయింపు!

- **రేవంత్ ప్రభుత్వం మౌనం వెనుక మతలబేమిటో!**
- **ఏపీకి వంతపాడుతున్న కేంద్రం.. చేష్టలుడిగిన రాష్ట్ర ప్రభుత్వం**
- **జీబీ లింక్‌పై డీపీఆర్‌కు ఏపీ రెడీ**
- **రూ.20 వేల కోట్లతో టెండర్లు**
- **కేంద్రం సమ్మతితోనే చేపడుతున్నట్టు బాబు ప్రకటన**
- **అలాంటిదేమీ లేదంటున్న ఉత్తమ్**
- **మన నీటిహక్కులకు నీళ్లొదలడమే అంటున్న ఇరిగేషన్ నిపుణులు**



జీబీ లింక్‌కు కేంద్రం హామీ..!

ఏపీ ప్రభుత్వం రూ.80 వేల కోట్లతో చేపడుతున్న గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చింది. ఆ దిశగా మేము వర్క్‌వుట్ చేస్తున్నాం. రూ.80 వేల కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం ఖర్చు కేంద్రమే భరించాలని మేం చెప్పడం లేదు. కేంద్రం, ఏపీ కలిసి హ్యామ్ మోడల్‌లో పనులను చేపట్టేందుకు ఆమోదం తెలుపాలని కోరాం. 200 టీఎంసీల మిగులు జలాలను గోదావరి నుంచి తీసుకెళ్లే జీబీ లింక్ ఏపీకి ఇదో గేమ్‌చేంజర్!

-మే 23న ఢిల్లీలో మీడియా సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు

అలాంటిదేమీ లేనే లేదట!

ఏపీ ప్రభుత్వం చేపడుతున్న జీబీ లింక్ ప్రాజెక్టుకు సంబంధించి తమ వద్దకు ప్రతిపాదనలేవీ రాలేదని కేంద్ర జల్‌శక్తి శాఖ రాష్ట్రానికి లేఖరాసింది. ఐదు నెలల క్రితం మేం రాసిన లేఖలకు కేంద్ర జలశక్తిశాఖ, ఆర్థికశాఖ ఇటీవల జవాబిచ్చాయి. మనం కేంద్రప్రభుత్వాన్ని విశ్వసించాలి. ఏపీ చర్యలను కేంద్రం నిలువరిస్తుందని ఆశిస్తున్నం. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి మేం అలర్ట్‌గానే ఉన్నాం. దాని గురించి అధ్యయనం చేస్తున్నం. తగిన సమయంలో స్పందిస్తాం.

-జూన్ 6న మీడియా చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : గోదావరి జలాలను కొల్లగొట్టేందుకు రూ.80వేల కోట్లతో చేపట్టనున్న గోదావరి-బనకచర్ల(జీబీ) లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం వేగంగా కదలకపోవడంపై నీటిపారుదలరంగ నిపుణుల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆరునెలలుగా జీబీ లింక్‌పై కదలికలు ఉన్నప్పటికీ.. నెలరోజులుగా ఏపీ చూపుతున్న దూకుడు, దానికి కేంద్రం సహకరిస్తున్నదన్న సంకేతాలు స్పష్టమవుతూనే ఉన్నాయి. తెలంగాణ జలహక్కులకు భంగం కలిగే ప్రాజెక్టుకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నది. అది నిర్లక్ష్యమా? నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో అవగాహన రాహిత్యమా? లేక ఏపీ పాలకులకు పరోక్షంగా సహకరించేలా సాగుతున్న కుమ్మక్కు రాజకీయమా? అనే సందేహాలు అటు తెలంగాణవాదుల నుంచీ ఇటు ఇరిగేషన్ నిపుణుల నుంచీ వ్యక్తమవుతున్నాయి. జీబీ లింక్‌పై కేంద్రం-ఏపీ మధ్య వరుస సమావేశాలు, కేంద్రానికి అందించిన ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు, కేంద్రం అందిస్తున్న నిధుల సాయం, ఢిల్లీ వేదికగా సీఎం చంద్రబాబే బనకచర్లపై స్పష్టత ఇవ్వడం వంటి పరిణామాల తర్వాత కూడా రేవంత్ సర్కారు కిమ్మనడం లేదు. తెలంగాణకు తీరని నష్టం కలిగించే ప్రాజెక్టు విషయంలో ఇంతవరకు ఎలాంటి కార్యాచరణనూ ప్రకటించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ స్పందనారాహిత్యానికి నిదర్శనంగా నిలుస్తున్నది. సీఎం రేవంత్ సైతం జీబీ-లింక్‌పై నోరు మెదపకపోవడం, క్యాబినెట్‌లో చర్చిస్తామని హడావుడి చేసి చివరకు ఎజెండా నుంచే తొలగించడం అనుమానాలను మరింత పెంచుతున్నాయి. ప్రాజెక్టును వ్యతిరేకిస్తామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ పైకి చెప్తున్నా.. ప్రభుత్వం వైపునుంచి చిత్తశుద్ధి ఎక్కడా కనిపించడంలేదు.

గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులను కొల్లగొట్టి బనకచర్ల ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ఎలా చేపడుతున్నదో, దానికి కేంద్రం ఎలా వత్తాసు పలుకుతున్నదో 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలను ప్రచురిస్తూ వచ్చింది. తెలంగాణ నీటి హక్కులను ప్రమాదంలో పడేసే ఈ ప్రాజెక్టు వెనుక జరుగుతున్న రాజకీయ క్రీనీడను కూడా కండ్లకు కడుతూవచ్చింది. ఏపీ సీఎం చంద్రబాబు పక్షం రోజులక్రితం ఢిల్లీలో మీడియా సమావేశంలో బనకచర్ల ప్రాజెక్టు చేపడుతున్న మాట నిజమేనని, కేంద్రం సంపూర్ణ సహకారం అందిస్తున్నదని కుండబద్దలు కొట్టారు. దాంతో నమస్తే తెలంగాణ కథనాలను పరోక్షంగా ఆయన అంగీకరించినట్టయ్యింది. మరోవైపు ప్రధాని మోదీ సైతం పోలవరం పునర్నిర్మాణం, గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును వేగవంతంపై సమీక్షలు నిర్వహించారని, త్వరగా నిర్మాణం పూర్తికి ఆదేశాలిచ్చారంటూ వార్తలు వచ్చాయి. ఇంత హడావుడి జరుగుతున్నా.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తనకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నది. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా జనవరిలో స్పష్టత కోరుతూ కేంద్రానికి లేఖ రాసిన ప్రభుత్వం.. గడిచిన ఐదు నెలల్లో ఆ దిశగా మరే చర్యా తీసుకోకపోవడం విమర్శలపాలవుతున్నది. తీరా ఇప్పుడు జీబీ లింక్ ప్రాజెక్టు ఏపీకి గేమ్‌చేంజర్ అంటూ చంద్రబాబు బాహాటంగానే చెప్తుండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం జనవరిలో రాసిన తమ లేఖకు కేంద్రం నుంచి ఇటీవల వచ్చిన జవాబును చూపెడుతూ కాలయాపన చేస్తున్నది. జీబీ లింక్‌పై తమవద్ద ప్రతిపాదన ఏదీ రాలేదని కేంద్ర జల్‌శక్తి, ఆర్థికశాఖలు చెప్పాయని మంత్రి ఉత్తమ్ అంటున్నారు. కేంద్రం చెప్పడం సరే.. జీబీ లింక్‌పై జరుగుతున్న పరిణామాలన్నీ చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే మౌనంగా ఉంటున్నదా అనే అనుమానాలున్నాయి.

త్వరలో డీపీఆర్ సమర్పణ

పునర్విభజన చట్టంలోని నిబంధనలన్నీ తుంగలోతొక్కుతూ ఏపీ ప్రభుత్వం గోదావరి- బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపట్టేందుకు దూకుడుగా ముందుకుసాగుతున్నది. 200 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్ బనకచర్ల మీదుగా పెన్నా బేసిన్‌కు మళ్లించేందుకు సిద్ధమైంది. రూ.80,112 కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు పనులకు కావాల్సిన నిధుల సమీకరణకు 'జలహారతి' పేరిట కార్పొరేషన్‌ను సైతం ఏర్పాటు చేసింది. అంతేకాదు జీబీ లింక్ ప్రాజెక్టులో భాగంగా పల్నాడు జిల్లాలో బొల్లాపల్లి వద్ద 150 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో జలాశయాన్ని నిర్మించేందుకు ప్రణాళికలను సిద్ధంచేసింది. రిజర్వాయర్‌కు సంబంధించి పల్నాడు జిల్లాలో 15 ముంపు గ్రామాల్లో సర్వే చేయించింది. పెన్నా బేసిన్‌లో కాల్వలను వెడల్పు చేసే పనులను నిర్వహిస్తున్నది. జీబీ లింక్ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ స్టడీస్ రిపోర్ట్‌ను గత 23వ తేదీనే కేంద్రానికి సమర్పించింది. అతిత్వరలోనే డీపీఆర్ సమర్పించేందుకూ ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది.

కేంద్రం సైతం వత్తాసు

ఏపీ చేపడుతున్న జీబీ లింక్ ప్రాజెక్టుకు కేంద్రం సైతం వత్తాసు పలుకుతున్నది. ఏపీ ప్రభుత్వం జీబీ లింక్ ప్రాజెక్టును తెరమీదకు తీసుకురాగా.. అభ్యంతరాలను వ్యక్తంచేస్తూ గత జనవరిలో తెలంగాణ సర్కారు లేఖ రాసింది. కానీ వాటిని పట్టించుకోకుండా ఏపీకి మాత్రం కేంద్రం స్పష్టమైన హామీని ఇచ్చినట్టే కనిపిస్తున్నది. జీబీ లింక్ ప్రాజెక్టుకు ఆర్థిక సాయం అందించాలని సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థికమంత్రిని కోరగా.. ఆర్థికమంత్రి వినతిపై కేంద్ర జల్‌శక్తిశాఖ సైతం ప్రాజెక్టుపై వేగంగా స్పందించింది. జీఆర్‌ఎంబీ మాత్రం కనీసం ఆ లేఖ సమాచారాన్ని తెలంగాణకు ఇవ్వలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉంటే సీఎం బాబు ఢిల్లీకి వెళ్లి ప్రధానితోపాటు, కేంద్రమంత్రులను కలిసి ఆర్థిక సాయం అందించాలని విన్నవించారు. వారు సానుకూలత వ్యక్తంచేశారని చంద్రబాబే మీడియా సమావేశం పెట్టి మరీ వెల్లడించారు. ఏపీకి అన్నివిధాలా మద్దతు తెలుపుతున్న కేంద్రం తెలంగాణను మాత్రం మభ్యపెడుతున్నది.

నెలాఖరున రూ.20వేల కోట్లతో టెండర్లు..

కేంద్రం హామీ లభించడంతో ఏపీ ప్రభుత్వం జీబీ లింక్‌పై దూకుడుగా ముందుకుపోతున్నది. జీబీ లింక్ ప్రాజెక్టుకు నెలాఖరున రూ.20వేల కోట్లతో టెండర్లను పిలిచేందుకు సిద్ధం చేయాలని ఏపీ సీఎం ఆ శాఖ అధికారులను ఆదేశించినట్టు సమాచారం. తొలిదశలో భాగంగా పోలవరం లింక్ పాయింట్ నుంచి నాగార్జునసాగర్ కుడి కాల్వ లింకింగ్ పనులకు రూ.20 వేల కోట్లతో టెండర్లను సిద్ధం చేయాలని సూ చించినట్టు తెలిపింది. అలాగే ఎన్‌డబ్ల్యూడీఏ టాస్క్‌ఫోర్స్ కమిటీ మీటింగ్, కన్సల్టెన్సీ మీటింగ్‌లను నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నదని తెలిసిపోతున్నది.

ప్రతిపాదనలే లేవంటున్న ఉత్తమ్

బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి ఏపీ ప్రభుత్వం ఓవైపు డీపీఆర్ సిద్ధం చేసి, టెండర్లు పిలిచే పనిలో బిజీగా ఉంటే.. మరోవైపు ఆ ప్రాజెక్టు ఇంకా ప్రపోజల్ దశ కూడా దాటలేదని తెలంగాణ ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్తున్నారు. జీబీ లింక్‌పై తమకే ప్రతిపాదనలు రాలేదని కేంద్రం తనకు రాసిన లేఖను అందుకు ఆధారంగా చూపుతున్నారు. అదే నిజమైతే.. మరి ఏపీ సర్కారు ఇప్పటికే ఎఫ్‌పీఆర్‌ను సమర్పించి, డీపీఆర్‌ను అందించడం అబద్ధమా? 'జలహారతి' పేరిట కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ఉత్తదేనా? బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలుపడంతోపాటు ఆర్థికంగా సహకారం అందించేందుకు సమ్మతించిందని చంద్రబాబు ఢిల్లీలో మీడియా సమావేశం పెట్టి మరీ ప్రకటించడం అబద్ధమా? పెన్నా బేసిన్‌లో కాలువల సామర్థ్యం పెంచేందుకు ఆగమేఘాలపై సాగుతున్న పనులు అబద్ధమా? ఒకవైపు హడావుడిగా పనులు సాగుతుంటే, కండ్లముందు అందుకు సాక్ష్యాలు కనబడుతుంటే.. రేవంత్ సర్కారు మాత్రం 'అదంతా మిథ్య' అన్నట్టుగా ఎందుకు వ్యవహరిస్తున్నది? తెలంగాణ జల ప్రయోజనాలు దెబ్బతీసే ప్రాజెక్టుపై ఎందుకింత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది? నీటిపారుదల రంగంపై అవగాహన లోపమా? సమస్యపై పట్టింపులేని ధోరణా? లేక ఏపీ సర్కారుతో కలిసి సాగిస్తున్న 'ఆల్ ఈజ్ వెల్' తరహా కుమ్మక్కు రాజకీయమా? ఇదే ప్రశ్నల్ని తెలంగాణవాదులు, నీటిపారుదలరంగ నిపుణులు లేవనెత్తుతున్నారు.

ఎందుకీ దాగుడుమూతలు?

తెలంగాణ జలహక్కులకు తీరని ముప్పు పొంచి ఉన్న తరుణంలో జీబీ లింక్‌పై ఇప్పటివరకు రేవంత్ ప్రభుత్వం నోరు మెదపలేదు. విమర్శలు వెల్లువెత్తడంతో మంత్రి ఉత్తమ్ జీబీ లింక్‌పై బలహీన వాదనను వినిపించే ప్రయత్నం చేశారు. ఏపీ, కేంద్రం ప్రాజెక్టుపై దూకుడుగా ముందుకుపోతున్న తీరు కళ్లకు కట్టినట్టుగా కనబడుతున్నా, బాహాటంగానే అన్నీ ప్రకటిస్తున్నా మంత్రి మాత్రం కేంద్రంపై తమకు విశ్వాసమున్నదని, ప్రాజెక్టుపై ముందుకుపోరని నమ్ముతున్నామంటూ పేర్కొనడం గమనార్హం. జీబీ-లింక్‌పై ఎందుకు ఘాటుగా స్పందించలేదని, కనీసం కేంద్రాన్ని ఎందుకు నిలదీయలేదని పలువురు నీటిపారుదలరంగ నిపుణులు, రిటైర్డు ఇంజినీర్లు ప్రశ్నిస్తున్నారు. రేవంత్ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రం చెప్పే మాయమాటలు వినకుండా.. తెలంగాణ జలహక్కుల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ఇరిగేషన్‌రంగ నిపుణులు సూచిస్తున్నారు.

'నమస్తే' చెప్పిందే నిజమైంది..

ఏపీ ప్రభుత్వం ఇంట్రా స్టేట్ రివర్ లింక్ ప్రాజెక్టు పేరిట ఇంటర్ స్టేట్ లింకింగ్ ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధమైంది. గోదావరి- బనకచర్ల (జీబీ) లింక్ ప్రాజెక్టు మాటున కావేరికి సైతం జలాలను తరలించేందుకు వ్యూహాత్మకంగానే అడుగులు వేస్తున్నది. ఇదే విషయమై నమస్తే తెలంగాణ ముందునుంచీ చెప్తూ వచ్చిందే నిజమైంది. తొలుత జీబీ లింక్‌ను చేపట్టి బనకచర్ల నుంచి ఆపై జలాలను సోమశిలకు, తద్వారా కావేరికి తరలించేందుకు కేంద్రం, ఏపీ గుట్టుగా కుట్రలు చేస్తున్నాయని ఇప్పటికే నమస్తే తెలంగాణ అనేక కథనాలను ప్రచురించింది. అది నిజమేనని తాజాగా కేంద్రం వేస్తున్న అడుగులు నిరూపిస్తున్నాయి. అందులో భాగంగా గోదావరి- సోమశిల- కావేరి లింక్‌ను చేపట్టే ప్రతిపాదనలనూ తెరపైకి తీసుకొచ్చేందుకు సిద్ధమైనట్టు విశ్వసనీయ సమాచారం. అందులో భాగంగానే నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ నెల 12న కన్సల్టెన్సీ మీటింగ్‌ను హైదరాబాద్ జలసౌధలో నిర్వహించాలని నిర్ణయించింది. కానీ ఆకస్మాత్తుగా ఆ సమావేశాన్ని 24కు వాయిదా వేసింది. కానీ ఇప్పుడు కన్సల్టెన్సీ మీటింగ్ లేకుండానే ఏకంగా ఉన్నట్టుండి 12వ తేదీనే టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని కేంద్రం నిర్ణయించడం ఆసక్తికరంగా మారింది.

కేసీఆర్‌ను ఎదుర్కోలేకనే కాంగ్రెస్, బీజేపీ కుట్రలు

కేసులకు, వేధింపులకు భయపడేదే లేదు • మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, జూన్ 10: కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కోలేకనే కాంగ్రెస్, బీజేపీ కూడబలుక్కొని ఆయనను ఇబ్బందులు పెట్టాలని కుట్రలు చేస్తున్నాయని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు ధోరణిలో భాగమే కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులని మండిపడ్డారు. కేసీఆర్ చట్టాన్ని గౌరవించి విచారణకు హాజరవుతున్నారని, కాంగ్రెస్, బీజేపీ కలిసి ఎన్ని కేసులు పెట్టినా, వేధింపులకు గురిచేసినా భయపడేదే లేదని స్పష్టంచేశారు. సబ్బండ వర్ణాలను కలుపుకొని సుదీర్ఘ పోరాటం చేసి తెచ్చిన తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలపడానికి పదేండ్లు అహోరాత్రులు కృషిచేసిన, తెలంగాణ బాగును కాంక్షించిన కేసీఆర్‌ను విచారణ పేరిట వేధింపులకు గురి చేయాలని కాంగ్రెస్ చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ వెంట యావత్ తెలంగాణ సమాజం ఉన్నదని, కుట్రలను ఛేదించి ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని దోషిగా నిలబెడుతామని, ప్రజాకోర్టులో శిక్షిస్తామని హెచ్చరించారు. మోదీ స్కూల్లో, చంద్రబాబు కాలేజీలో చదువుకొని, రాహుల్‌గాంధీ దగ్గర ఉద్యోగం చేస్తున్నట్టు చెప్తున్న రేవంత్‌రెడ్డి.. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో ఉద్యోగ ధర్మంలో విఫలం కావడం వల్లే 45 సార్లు ఢిల్లీకి చెక్కర్లు కొట్టినా రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. మొన్నటివరకు విద్యుత్తుపై కమిషన్ వేసి కేసీఆర్‌ను, ఫార్ములా వన్ విచారణ పేరిట కేటీఆర్‌ను, అదేవిధంగా బీఆర్‌ఎస్ నాయకులను ఏ అవకాశం దొరికినా కక్ష సాధింపులతో ఇబ్బందులు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 18 నెలలకే కాంగ్రెస్ పరిపాలన తెలంగాణకు శాపం అని ప్రజలందరూ అనుకుంటున్నారని పేర్కొన్నారు.

కేసీఆర్‌కు నోటీసులు కాంగ్రెస్ కుట్రే

కక్షసాధింపుల రేవంత్‌కు ప్రజాకోర్టులో శిక్ష తప్పదు: మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, జూన్ 10 : చావు నోట్లో తల పెట్టి తెలంగాణ సాధించిన ఉద్యమ యోధుడు కేసీఆర్‌కు ఇన్ని వేధింపులా? అని బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మండిపడ్డారు. రాజకీయంగా కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము లేకనే ఎలాంటి లోపాలు లేని కాళేశ్వరం ప్రాజెక్టుపై విషం కక్కుతూ ఆయనకు నోటీసులు జారీ చేయడం కాంగ్రెస్ కుట్రలో భాగమేనని మంగళవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. కేసీఆర్‌ను విచారణకు పిలవడాన్ని తెలంగాణ ప్రజలు బ్లాక్‌డేగా పరిగణిస్తున్నారని తెలిపారు. కేసులు, విచారణకు భయపడేది లేదని స్పష్టంచేశారు. ఉద్యమనేత కేసీఆర్‌తో పెట్టుకున్నోళ్లు ఎవరైనా మట్టికొట్టుకుపోతారని హెచ్చరించారు. గద్దెనెక్కిన తొలి రోజు నుంచే కక్షసాధింపుల పర్వానికి తెరలేపిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదని పేర్కొన్నారు. తనవి బీజేపీ, టీడీపీ మూలాలని రేవంతే స్వయంగా చెప్పుకున్నారని గుర్తుచేశారు. రేవంత్ చదివిన మోదీ, చంద్రబాబు స్కూళ్లకు చీటింగ్ తప్ప రేటింగ్ లేదని ఎద్దేవా చేశారు. పేమెంట్ కోటాలో రాహుల్ గాంధీ వద్ద ముఖ్యమంత్రి ఉద్యోగం సంపాదించుకుని తెలంగాణను దోపిడీ చేస్తూ ఢిల్లీకి డబ్బుల మూటలు మోస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధిష్ఠానానికి తన అసలు రంగు తెలియడంతో పదవిని కాపాడుకునేందుకు రాహుల్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఆరోపించారు.

జస్టిస్ ప్రియదర్శినికి హైకోర్టు నివాళి

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): అనారోగ్యంతో ఇటీవల కన్నుమూసిన జస్టిస్ మాటూరి గిరిజా ప్రియదర్శిని (61)కి హైకోర్టు ఘనంగా నివాళులర్పించింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ అధ్యక్షతన మంగళవారం ఫస్ట్ కోర్టు హాల్‌లో సమావేశమైన జడ్జిలు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు జస్టిస్ ప్రియదర్శిని ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ 2 నిమిషాలు మౌనం పాటించారు. న్యాయవ్యవస్థకు ప్రియదర్శిని అందించిన సేవలు, ఆమె వెలువరించిన కీలకమైన తీర్పులను అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి ప్రస్తుతించారు. కార్యక్రమంలో అడిషనల్ సొలిసిటర్ జనరల్ నర్సింహశర్మ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు, బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నరసింహారెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు జగన్, జస్టిస్ ప్రియదర్శిని కుటుంబసభ్యులు, పలువురు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు, హైకోర్టు సిబ్బంది పాల్గొన్నారు. కాగా, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రత్యేకంగా సమావేశమై జస్టిస్ ప్రియదర్శిని మృతికి సంతాపం తెలిపింది.